
# పీక్కపిత్రే



"ఏలూరులో ఏ రోడ్డు చివర ఏముందో చెప్పగలను. బందరులో ఏదారమ్మ టెల్తే ఏఏ ఊళ్ళొస్తాయో గుక్క తిప్పుకోకుండా వల్లేయగలను. అంతెందుకు, బెజవాడలో ఏ పేటెక్కడుందో ఎంచక్కా స్కెచ్‌వేసి చూయించగల్ను. కాని హైదరాబాద్‌లో..." అర్ధాంతరంగా ఆపేసి బరబరమని బుర్ర గోక్కోసాగాడు బ్రహ్మానందం (బ్రహ్మం).

"మరీ అంతలా గోకమాక. ఉన్నదే కొంచెం బొచ్చు. ఆ కాస్తా ఊడిపోతే ఏం చేస్తావ్?" హెచ్చరించాడు- మంచి మిత్రుడు నరసింహం (సింగం).

కసుక్కున దిగిపోయే కత్తిలాంటి చూపొహటి చూసి మళ్ళీ గోక్కోబోయి ఆగిపోయాడు. దాంతో వస్తున్న ఆలోచన కూడా అక్కడే ఇరుక్కుపోయింది.

"హైదరాబాదు మొగమెరగనోడివి, గోవిందంగాడు(గోవిందరావు) రమ్మనగానే వస్తానని ఎలా జెప్పావురా?" అమితంగా ఆశ్చర్యపోయాడు సింగం.

"నువ్వు మరీ నన్నంత ఈజీగా తీసి పారెయ్యకు. ఇప్పటికి ఐదారుసార్లైనా హైదరాబాదెళ్ళాను" పౌరుషంతో పాటు మూతీ పొడుచుకొచ్చింది బ్రహ్మానికి.

"మరైతే ఆ బుర్ర గోక్కోటమెందుకో!"

"మరదే నాకు పిచ్చగా ఉంది" యథాలాపంగా బుర్ర గోక్కుంటూ అన్నాడు బ్రహ్మానందం- "వాడు నాకు రమ్మని జెప్పింది సికింద్రాబాదు ఎడ్రసు"

"ఓర్నీ, అంతేనా! అదేదో అమలాపురం- అన్నవరమంత తేడావున్నట్టు బాదపడతావేంట్రా?"

"బాద కాదు, బాధ!" అంత టెన్షన్‌లోనూ ఉచ్చారణ దోషాన్ని ఉపేక్షించలేక పోయాడు బ్రహ్మం.

"ఇహ నీ బతుక్కి గోవిందంగాడి ఎడ్రెసెతుక్కోటం కష్టమేలే!" తీర్మానించాడు సింగం. అలా అంటూ గిరుక్కున ఒక్కసారి తల అటునుంచిటు తిప్పాడు.

సింహం జూలులాంటి అతని జుట్టు ఆ ఊపుకి స్లోమోషన్‌లో కదిలినట్టు కదిలింది. నరసింగం పేరుకు నప్పేది ఆ జుట్టొక్కటే మరి. నిజానికి గడకర్రకి పుల్లల్లాంటికాళ్ళూ చేతులతికించి, లక్కపిడతలాంటి తల అలంకరించినట్టుంటాడు నరసింగం. పేరు విన్నవాళ్ళు మనిషిని చూసేందుకు ధైర్యం కూడగట్టుకోవాల్సిందే.

"ఏం?" బొమ్మలెగరేశాడు బ్రహ్మానందం.

"ఏమా? ఈ బాషతోనే ఇక్కడ గొట్టుకు ఛస్తున్నావ్. ఇక హైదరాబాద్‌లో బాష వింటే, అక్కడే చచ్చూరుకుంటావ్. అప్పుడు మళ్ళీ నేను ఏ 'గోదారి'లోననో కొట్టుకొచ్చి, 'కృష్ణా'తో నిన్ను పట్టుకురావాలి!" అంటూ ఆయాసం తీర్చుకునేందుకు క్షణం విరామం తీసుకున్నాడు సింగం. ('బాష' అన్నప్పుడల్లా అందులోని దోషాన్ని సహించలేక మొహం చిట్లిస్తూనే ఉన్నాడు బ్రహ్మం)

"ఇంతకూవాడు జెప్పిన ఎడ్రస్సేంటో?" తనేమైనా జుట్టు పీక్కోవచ్చేమోనని అడిగాడు సింగం.

"సికింద్రాబాదు...ఫ్యాక్టరీ... అమ్మవారి గుడి...పీళ్పిత్రే.." పొడిమాటల్ని పొడిపొడిగా చెప్పి, మొహం కొశ్చన్‌మార్కు మాదిరిగా పెట్టాడు బ్రహ్మానందం.

"అదేంట్రా? కాస్త ఇవరంగా అడగలేకపోయినావా?" బ్రహ్మంతో పోటీగా బుర్ర గోక్కున్నాడు సింగం.

"అదే గదా! ఈ బట్టల సత్తిగాడి ఫోన్నెంబరియ్యటం పెద్ద పొరబాటయ్యింది. మొన్న ఆదివారం నాడు మందుపార్టీలో వాడికీ నాకూ చెడిందిలే. అప్పట్నించీ ఏ

ఫోన్ కాలొచ్చినా చెప్పి చావట్లేదు. ఏదో లక్కీగా వాడు ఇంట్లో లేని సమయంలో ఫోనొచ్చింది. వాళ్ళావిడ మంచిదిగాబట్టి చెప్పింది. నా అదృష్టానికి తగ్గట్టుగానే లైన్ సరిగ్గాలేదు. సగం-సగం వినిపించింది. ఏం చెయ్యాలో తోచట్లేదురా!'' మళ్లీ బుర్ర గోక్కోక తప్పలేదు బ్రహ్మానందానికి.

“బండి సికింద్రాబాద్ నుండేగదా హైదారాబాదెళ్ళేది. అక్కడ దిగి ఎడ్ర సడుగు. ఎవడైనా చెప్పకపోతాడా!'' బోల్డు సానుభూతి గుమ్మరించాడు సింగం.

అంతకంటే గత్యంతరం కనిపించలేదు బ్రహ్మానికి.

* * *

సికింద్రాబాద్‌లో ట్రెయిన్ దిగి, గోవిందం గురించి ఆలోచిస్తూ బుర్ర గోక్కున్నాడు బ్రహ్మం.

బ్రహ్మానందంతో పాటే బందరులో ఓ ప్రైవేట్ స్కూల్లో పనిచేసే గోవిం దరావు. ఓరోజు హైదరాబాదొచ్చేశాడు, సినిమాల్లో తన అదృష్టాన్ని పరీక్షించు కోవాలని. సినిమా ఛాన్సు కాదుకదా, టీవీలో కూడా కనపడటం గగనమని అర్థంచేసుకోవడానికి అట్టేకాలం పట్టలేదు.

మళ్ళీ వెనక్కెళ్ళడానికి మొహంచెల్లక, బతుకు గడవక అతి కష్టంమీద సికింద్రాబాద్‌లో ఓ స్కూల్లో క్లర్కుగా చేరాడు. ఆశ చావక టీ.వీ. వేషాలకోసం చేస్తున్న ప్రయత్నం మరోలా ఫలించింది. నటుడుకాదు గానీ పాటలు రాసేవాడుంటే పట్టుకురమ్మని. తనకా పని చేతగాదని అద్భుతమైన కవితాశక్తి గల్గిన తన మిత్రుడు (బ్రహ్మం) ఒకడున్నాడని, అవకాశమిప్పించాలని అడిగాడు. పర్య వసానంగా బ్రహ్మానందం దయచేశాడు.

బందరులో బయల్దేరేటప్పుడే నగరంలోని ఆటోవాళ్ళ మొహం చూడొద్దని గట్టిగా ఒట్టేసుకున్నాడు గాబట్టి స్టేషన్ బయటికి రాగానే వాళ్ళని చూడకుండా పెడమొహంపెట్టి ముందుకు నడవసాగాడు. అంతలో సడెన్‌గా కాలికేదో తగిలి బోర్లాపడబోయాడు. అంతలో ఓ రెండు బలిష్టమైన చేతులు అతను పడిపోకుండా కాపాడాయి.

“ఏందిబై, జెర జూస్కోని నడువరాదూ!'' భాషలోని యాసతోపాటు గుప్పుమన్న గుట్కా వాసనకి మళ్ళీ పడబోయి, సంభాళించుకున్నాడు బ్రహ్మం.

“గట్ల పరేషానైతున్నవేంది. యాడికి బోవాలె?''

వాడి మాటల్లోని అమర్యాదకి చిర్రెత్తుకొచ్చింది బ్రహ్మానందానికి. అంతలోనే వాడు తనని పడకుండా కాపాడాడన్న కృతజ్ఞత ఓ మూల గీకుతుండటంతో ఏమీ అనలేకపోతున్నాడు.(వాడే కాలడ్డుపెట్టి పడేలా చేశాడని అతను గ్రహించకపోవడం యాదృచ్ఛికం)

"రాండ్రి సార్! నేన్ దీస్కపోత. యాడికి బోవాల, జెర్ర పతా జెప్పు" బ్రహ్మానందం తేరుకునేలోపే అతని చేతిలో నుండి సూట్‌కేస్ లాక్కుని తీసుకొనిపోయి తన ఆటోలో పెట్టుకున్నాడు. ఏది జరగకూడదని బలంగా కోరుకుంటామో అది జరగటమే కదా జీవితం. మొహమాటం, అయోమయం అంతకుమించి అమాయకత్వం బలవంతంగా బ్రహ్మానందాన్ని ఆటోలోకి నెట్టేశాయి. అడ్రస్ అడగకుండానే స్టార్ట్‌చేశాడు ఆటోవాలా.

"ఎక్కడికెళ్ళాలో చెప్పకుండానే తోల్తావేమయ్యా?' భయం, కోపం కలిశాయి బ్రహ్మంగొంతులో.

"నీవు జెప్తలేవు గదసార్!" అందులో తన తప్పేమీ లేదన్నట్టు ఒకింత నిర్లక్ష్యం-ఆటోవాలా.

"అమ్మవారి గుడి...ఫ్యాక్టరీ!" అన్నాడు పొడిగా.

ఒక్క నిముషం ఆటో ఆపి బుర్ర గోక్కుని-"పచాస్ రూపయే అయితయ్ సాబ్!" అన్నాడు.

"అంటే?" బుర్ర గోక్కున్నాడు బ్రహ్మం.

"యాభై" చెప్పాడు ఆటోవాలా.

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు బ్రహ్మానందం.

"ఏం మీటరెయ్యవా?" దబాయించబోయాడు.

"కిందికి దిగుసార్!" హుంకరించాడు ఆటోవాలా.

ఒక్కసారిగా గతుక్కుమన్నాడు బ్రహ్మం.

"ఎందుకూ?" దిగటానికి అభిమానం అడ్డొచ్చింది.

"మీరు జెప్పింతాన బొవ్వాలంటే గంతే అయితయ్... అరె ఏ కైసా గిరాక్ హైరే భయ్! (ఇదేం గిరాకిరా బాబూ)" చిరాకు పడ్డాడు ఆటోవాలా.

క్షణం బుర్ర గోక్కున్నాడు బ్రహ్మానందం. 'వెళ్ళేది సినిమా ఛాన్స్‌కోసం. పైగా కొత్తఏరియా. బస్సులు సమయానికుంటాయో ఉండవో, సరే, కానీ! ఒక్కోసారి

ఇటువంటి నష్టాలుతప్పవు మరి. మహా అయితే డబుల్ హైర్ తీసుకుంటాడేమో! 'ఏం చేస్తాం!' ఓ నిట్టూర్పుతో సర్దిచెప్పుకొని- "మీరన్నంతే కావాలంటే ఎలాగండీ! ఓ నలభై ఇస్తాను" మెత్తగా బేరమాడాడు.

"ఓ సబ్‌నై జమ్‌తా. దూసరా ఆటో దేఖలో(అదంతా కుదర్దు. వేరే ఆటో చూసుకో)" ఆటోదిగాడతను.

"సరేలే! పోనీ!" అన్నాడు మరింకాస్సేపు వాడితో మాట్లాడితే మరెన్ని బూతులు వినాల్సి వస్తుందో నన్న భయమూ అతని నిర్ణయాన్ని సమర్థించింది.

స్టేషన్ నుండి ఆటో బయలుదేరి కొద్దిదూరం వెళ్ళాక కుడివైపు సందులోకి తిరగడం మాత్రం గ్రహించగలిగాడు బ్రహ్మానందం. ఆ తర్వాత గల్లీలూ - మలుపులూ లెక్కబెట్టుకోవడం ఆ బుర్రకి సాధ్యంకాలేదు.

ఓ పావుగంటసేపు ఎక్కడెక్కడో తిప్పి, చివరికో దేవాలయం ముందు ఠక్కున ఆగింది ఆటో.

"దిగుసార్. గిదే అమ్మవారి గుడి!" ఆటోవాలా ఒరిజినల్ మర్యాదపూర్వక మయిన భాష.

"ఏంటీ? అప్పుడే వచ్చేశామా?" అన్నాడు బ్రహ్మం.

'దొంగవెధవ! దోపిడీనాయాల! ఈ మాత్రానికే యాభై రూపాయలా? ఇలాంటి దగుల్బాజీలు పురుగులు పడి ఛస్తారు!' మనసులో తిట్టుకుంటూ దిగాడు.

"షాట్‌కట్‌ల వచ్చినం సార్! జెల్దీ పైసలియ్యుండ్రి! పోలీసోడు జూస్తే ఫైనేస్తడు" తొందరపెట్టాడతను.

'పోలీసోడు ఫైనెందుకేస్తా'డో అర్థంగాకపోయినా, అది తనకనవసరమని, ముందు వాడ్ని అక్కడనుండి పంపేయడమే శ్రేయస్కరమని, యాభై రూపాయల కొత్తనోటు వాడిచేతిలో పెట్టాడు. మరుక్షణం వాడు మాయమయ్యాడు.

'యాభై రూపాయలు పోతేపోయాయి. అమ్మవారి గుడికైతే వచ్చేశాను - చాలు! ఇహ ఇప్పుడు ఫ్యాక్టరీ వెతుక్కోవాలి' అనుకుంటూ గుడివైపు చూశాడు.

చాలామంది ఆ దారంట హడావుడిగా వెళ్తూ-వెళ్తూ క్రిస్టియానిటీకి, హిందూ యిజానికి మధ్యరకంగా(చేతిని మొహానికి రెండువైపులా ఆడించి వేళ్ళని ముద్దు పెట్టుకుంటూ) దండాలు పెట్టుకుంటూ ఆఘమేఘాలమీద, ఆగకుండా ఉరుకులు పరుగులు పెడుతున్నారు. కొందరైతే చెప్పులూ, షూస్ వదలకుండానే పనికానిచ్చేసు కుంటున్నారు. 'ఔరా! ఈ సంస్కృతి ఎంత సంకరమైపోయింది?!' అనుకోకుండా ఉండలేకపోయాడు బ్రహ్మం.



"ఏం గావాలన్నా? గట్ల జూత్తా న్నవూ!?" పక్కన సడెన్‌గా వినిపించిన పిలుపుకి తలతిప్పాడు బ్రహ్మం.

ఆరడుగులపోడుగున వున్న భారీ ఆకారం. గురజాడవారి గిరీశానికి వారసుడిలా వున్నాడు. వాలకం చూస్తే వరంగల్ ఏరియా వాడనిపిస్తోంది. 'అయినా వీడితో మనకెందుకూ? అసలే అభినవ గిరీశం లాగున్నాడు. వీడి దగ్గర ఆల్రెడీ బోలెడు కుచ్చు టోపీలుండే ఉంటాయి.' అనుకుంటూ, ఏమీ మాట్లాడకపోతే బాగోదని-

"ఆ...ఏం లేదు లెండి! అమ్మవారి దర్శనంకోసం" తడబడే పొడిమాటల్ని గుదిగుచ్చి, వాని సమాధానంకోసం ఎదురుచూడకుండా కిందపెట్టిన సూట్‌కేస్ చటుక్కున చేతిలోకి తీసుకుని, గబగబా నాలుగడుగులేసి, రోడ్డుమీదే ఆలయాని కెదురుగా నిలబడ్డాడు.

వాడు తన దగ్గిరికి రావడంలేదని కన్‌ఫమ్ చేసుకొని, సూట్‌కేసు కిందపెట్టి, రెండు చేతులూ జోడించి, గట్టిగా కళ్ళుమూసుకుని మనసారా ప్రార్థన చేశాడు.

మళ్ళీ కళ్ళు తెరిచే సరికి గుండె ఆగిపోయింది.

కిస్సుస్‌స్ మనే పాము బుసలాంటి నవ్వు వినిపించింది. తనదైన స్టైల్లో నవ్వుతున్నాడు 'గిరీశం'

"సూటుకేసు కోసరం జూత్తన్నావ్? నేనే బటుకున్నా. గట్ల దానిమానాన దాన్ని ఇడుసవెడ్తె ఎవ్వడన్న...ఎత్తుకపోతరు. ఏమనుకున్నవ్? ఇది హయిద్రాబాదు" అన్నాడు అతను మునుపటి నవ్వునే కంటిన్యూ చేస్తూ.

వాడి చేతిలోంచి సూట్‌కేసు లాక్కొని భయం, అయోమయం నిండిన చూపుల్తో చూశాడు.

"గట్ల పరేషానైతాన్న వేందన్నా? యాడికెల్లచ్చినవ్? యాడికి బోవాల?" గుచ్చి గుచ్చి చూస్తూ అడిగాడు.

చెప్పకుండా సంభాషణ కొనసాగించడం కంటె, చెప్పివీడ్ని తప్పించుకోవడమే మంచిదన్న నిర్ణయానికొచ్చాడు బ్రహ్మం- "ఫ్యాక్టరీకెళ్ళాలి!" అన్నాడు సూటిగా.

"ఏందీ? ఫ్యాట్రీకి బోవాల్నా? ప్యాట్నీకా?" గిరీశం.

"ఫ్యా..క్ట..రీ...అంటే ఇండస్ట్రీ" చెప్పాడు బ్రహ్మం.

"ఏందీ? కంపినికి వోతావ్?" బుర్ర గోక్కున్నాడు గిరీశం. "గిటేడుందన్నా ఫ్యాట్రీ. నువ్వేదో రాంగడ్రసుల కచ్చినవన్నా" సానుభూతి చూపాడు.

"అంటే? ఈ చుట్టుపట్ల ఎక్కడా ఫ్యాక్టరీ అనేది లేదా?" బ్రహ్మానందం అపనమ్మకం.

"సుట్టుపక్కల గాదు, కూతపెట్టు దూరాన ఎక్కడా ఫ్యాట్రీ లేదు" క్షణమాగి మళ్ళీ అన్నాడు. "ఆ! నాలుగడులు గిటు ఎడమపక్కకు దిరిగితె ప్యా...ట్నీ..ఉన్నది" 'ప్యాట్నీ...ఫ్యాక్టరీ...ఇండస్ట్రీ...కంపెనీ' గుర్తు చేసుకుంటూ ఆలోచించాడు బ్రహ్మం.

"గోవిందం మాటల్లో ఇవేవీ లేవే? ఇంకేదో అన్నాడు. ఏంటబ్బా అది...? ఫ్యాక్టరీ లాంటిదే... సేమ్‌మీనింగ్.." గొణుక్కుంటున్నట్టు బయటికే అనేశాడు.

"ఫ్యాట్రీ లాంటిదా..? కంపినీగాదా...? కార్ఖానా..?"

"మళ్ళీ అను" పజిల్ సాల్వవుతున్నట్టు అడిగాడు.

"కార్ఖానా!" మరింత స్పష్టంగా అన్నాడు గిరీశం.

"అవును కరెక్ట్! కార్ఖానా! కార్ఖానా అంటే ఫ్యాక్టరే గదా!" తన తెలివి ఋజువుకావడంలోని సంతోషానికి సతమతమయ్యాడు బ్రహ్మానందం.

మళ్ళీ తనదైన శైలిలో నవ్వాడు గిరీశం. ఈసారి చాలాసేపు నవ్వాడు. మళ్ళీ-మళ్ళీ నవ్వాడు..."కార్ఖానా...కార్ఖానా...అంటే ఫ్యాట్రీ...ఫ్యాట్రీ గాదన్నా...అది ఏరియా పేరు" చావుకబురు చల్లగా జెప్పేశాడు.

నోరు తెరిచాడు బ్రహ్మానందం.

"అరె, పచ్చీస్‌సాల్ బట్టి అటేపే ఉంటాన్న. కార్ఖానాబోవాలగద? ఇగో గిట్ల సక్కగ బొయినవంటె సకింద్రాబాద్ స్టేషనొస్తది. గంతదూరం గూడదు. స్టేషన్‌కంటె ముందే కుడిపక్క బస్టాపున్నది. గాడ 21 నుంచి 25 దాకా ఏ నెంబర్ బస్సెక్కినా కార్ఖానాల దిగుతవ్" అంటూ వివరించాడు గిరీశం.

"ఏంటీ ఆ కనిపించేదే స్టేషనా?" పరిశీలనగా చూస్తూ అడిగాడు బ్రహ్మం.

"గదే మరి. అయినా గీడ గూడ బస్సెక్కొచ్చు ఇస్లో అయితే. కాని, హైద్రాబాద్ డ్రైవర్లు శానా ఖతర్నాక్ ఉంటరు.మనుషులెక్కుతున్నరని దెలిస్తే, ఇస్పీడ్‌గ దోల్తరు. అసలే నీవుకొత్తగనిపిస్తాన్నవు. కదిలే బస్సెక్కితె కరుసైపోతవు. నాలుగడుగులు

నడిస్తె గురుద్వార్ బస్టాపున్నది. గాడ బొచ్చెడు బస్సులుంటయ్ పో!" హితబోధ చేశాడు. ఆటోవాడెంత దగా చేశాడో అప్పటిగ్గానీ అర్థం కాలేదు బ్రహ్మనికి. అతనికి ఓ దండం పెట్టి, బస్టాపువైపు నడక సాగించాడు.

* * *

"ఏయిహై కార్ఖానా! ఉతరో!"(ఇదే కార్ఖానా! దిగు!) కండక్టరు చెప్పాడు కటువుగా. 'నీ యమ్మా కడుపుమాడా! కార్ఖానా అంటూనే మళ్ళీ ఉత్తరం, దక్షిణం అంటాడే వెధవ!' అనుకుంటూ అయోమయంగా చూశాడు బ్రహ్మం.

"గట్ల జూస్తవేందివయా? దిగుమంటే" కండక్టరు మాటపూర్తికాలేదు. ఆగినట్టే ఆగి స్టార్టయ్యింది బస్సు. "అరె...!రోకో! రోకో" అంటూ బస్సుటాపు విరిగేలా పంచ్‌తో కొట్టాడు కండక్టరు. వానిప్రయత్నం రెండు ఫర్లాంగులు దాటితేగాని ఫలించలేదు.

"అరె..దిగువయ్యా...!" ఆగి ఆగకుండా వెళ్తున్న బస్సునుండి 'దిగాలా...వద్దా' అనే మీమాంసలో కొట్టుకుంటున్న బ్రహ్మన్ని నిర్దాక్షిణ్యంగా తోసేశాడు కండక్టరు.

రోడ్డుమీద పడిపోయాడు బ్రహ్మం. తెల్లడ్రెస్సు మరకల్తో, మురికిగా తయారైంది. ఏడుపొచ్చేసింది పాపం! 'ఓ కవినీ, పండితుడ్నీ, అనాకారి వెధవల్తో, నిరక్షర కుక్షుల్తో... ఛ!... ఎన్ని అవమానాలు?' తన మీద తనకే విపరీతమయిన జాలి కలగడంతో అడుగులు మరీ బరువయ్యాయి.

"ఆఁ! గిదే కార్ఖానా! గదే అమ్మవారి గుడి!" బ్రహ్మం ప్రశ్న పూర్తిగాకుండానే ఓ మనిషి సమాధానం చెప్పాడు.

'హమ్మయ్యా!' గట్టిగా ఊపిరి పీల్చుకున్నాడు బ్రహ్మం. కాని ఆ ఆనందం ఎంతో సేపు నిలువలేదు. గోవిందం చెప్పిన 'పీకొప్రొతే' బోర్డు మాత్రం ఎక్కడ కనిపించలేదు. ఎవర్నడిగినా ఓ వెర్రిచూపు, ఓ పిచ్చి నవ్వూ నవ్వి, రకరకాల అనుమానాలతో తలాతోకాలేని ప్రశ్నలడిగి విసిగిస్తున్నారు. అప్పుడు సడెన్‌గా అతని దృష్టి 'అంగుష్టావధానం' చేస్తున్నట్టు మాట్లాడుకుంటున్న కొంతమంది బధిరుల మీద పడింది. అంతే- గోవిందం రంగూ, రూపూ, ఆకారం, వ్యవహారం వర్ణించి, ఎడ్రసు తెలుసుకున్నాడు.

* * *

గోవిందం గాడు కనిపిస్తే ముక్కల ముక్కల కింద నరికేయాలన్న ఆవేశం కాస్తావాడ్ని చూసేసరికి ఏడుపుగా మారిపోయింది.

'శాన్నాళ్ళ తర్వాత కలిసిన ఆనందం తట్టుకోలేక ఏడుస్తున్నాడు. పిచ్చివెధవ! వెరీ సెన్సిటివ్! కవులంతా సెన్సిటివులే కదా! అనుకుంటూ సముదాయించాడు.

"పీశ్‌ప్రే ఏమిట్రా?" సడెన్‌గా కౌగిలి విడిపించుకొని అడిగాడు.

వాడలా అడుగుతాడనుకోలేదు గోవిందం. ముసిముసిగా నవ్వాడు. కారం పూసుకున్నట్టనిపించింది బ్రహ్మానికి.

"నేనింత సీరియస్‌గా అడుగుతుంటే అలా నవ్వుతావేంట్రా?" జరిగిన అవమానాలు గుర్తొచ్చాయి బ్రహ్మానికి.

"ఇప్పుడవన్నీ ఎందుకులేరా! అడ్రసు దొరికింది కదా! ముందు హాయిగా స్నానం చేసెయ్. తర్వాత భోంచేసి ప్రొడ్యూసర్ గార్ని కలుద్దాం!" అన్నాడు గోవిందం.

"నో! ముందు నాకది తెలియాలి!" అన్నాడు బ్రహ్మం. బ్రహ్మం మొండితనం తెలిసిన గోవిందం అతడ్నిమళ్ళీ కార్ఖానా అమ్మవారి గుడివద్దకు తీసుకొచ్చి-

"అదిగో! అది చదువ్!" ఓ బడ్డీకేసి చూయించాడు గోవిందం.

అక్కడ బోర్డ్‌మీద లేతనీలం రంగు బ్యాక్‌గ్రౌండ్‌లో పెద్దసైజు తెల్లటి అక్షరాలు పెయింట్ చేయబడి ఉన్నాయి. 'పీశ్‌ప్రే' అని.

ఒక్కసారిగా తలగిర్రున తిరిగింది బ్రహ్మానికి. "ఇదేమిట్రా?" అన్నాడు.

మరోసారి చిద్విలాసంగా నవ్వి-

"అది హైదరాబాద్ పెయింటర్స్ భాష తెలుగు లిపిలో ఇంగ్లీషు. 'ఫిష్ ఫ్రై' అని దాన్నర్థం చేసుకోవాలన్నమాట. అసలు వర్డే నీకు చెప్పేవాడ్ని. కాని, భాషంటే ప్రాణం పెట్టే నీకు పదాన్ని ఉన్నదున్నట్టు చెప్పడమే మంచిదని అలా చెప్పాను. ఆ బడ్డీలో బిజీగా చేపముక్కల్ని వేపుతున్నాడే శ్రీను, వాడు మనకి క్లోజు, భాషపట్ల ఆసక్తిగల నిన్నీ పేరూ, అక్షరాలూ ఆకర్షిస్తాయని, అట్టే శ్రమ లేకుండా కనిపెట్టేయగలవనీ, బడ్డీలో నా గురించి అడిగితే అనాయాసంగా నా అడ్రసు పట్టుకోగలవనీ అనుకున్నాను.

దురదృష్టవశాత్తూ అన్నీ వివరంగా చెప్పే అవకాశం లేకపోయింది- లైన్స్ బాలేనందునవల్ల. 'సారీ'రా!" నిజాయితీగా క్షమాపణడిగాడు గోవిందం. ఆశ్చర్యంలో నుండి ఇంకా తేరుకోలేదు బ్రహ్మానందం.

**(9-01-2004 స్వాతి సచిత్ర వారపత్రిక)**